క్లుప్తంగా

వెండి ముఖ కవచం బహూకరణ



గట్టు: మహాశివరాత్రి సందర్భంగా గట్టుకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ చిన్న బస్వరాజు కుమారులు శివసాయిప్రసాద్, ఉదయ్‌కుమార్‌లు శ్రీ వీరభద్రస్వామికి వెండి ముఖ కవచాన్ని బహూకరించారు. 60 తులాల వెండితో ప్రత్యేకంగా చేయించిన శ్రీవీరభద్రస్వామి ముఖ కవచాన్ని గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారికి వెండి ముఖ కవచాన్ని అలంకరించారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శివభక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు

గద్వాల: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం పట్టణంలోని అంధుల పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో కేక్‌కట్ చేసి వారికి అల్పాహారం అందించారు. కార్యక్రమంలో రజక నర్సింహులు, రజక జయశ్రీ, కృష్ణవేణి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, బండల పద్మావతి, మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, దేవదాసు, నర్సింహ, మోహన్ రెడ్డి, తిమ్మన్న, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న డ్రెయినేజీ స్లాబ్ నిర్మాణం



అమరచింత: పట్టణంలోని పలు వార్డుల్లో ప్రధాన మురుగుకాల్వపై స్లాబ్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలో మున్సిపాలిటీ ద్వారా రూ.3 లక్షలతో 6 స్లాబ్‌ల నిర్మాణ పనులు చేపట్టారు. 15 రోజుల నుంచి 8, 9, 6 వార్డుల్లో ప్రజల అవసరాల మేరకు మురుగు కాల్వపై నూతనంగా స్లాబ్‌లను నిర్మిస్తున్నట్లు కమిషనర్ రవిబాబు తెలిపారు. గతంలో మురుగు కాల్వ నిర్మాణ సమయంలో స్లాబ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో కాల్వలోని మురుగు ముందుకు వెళ్లకుండా శిథిల స్లాబ్‌ల వద్ద నిలిచిపోతుంది. దీంతో మురుగు నీరు రహదారిపై వస్తుందని ఆయా వార్డుల ప్రజలు విన్నవించడంతో నూతన స్లాబ్‌ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

దత్తాత్రేయస్వామి రథోత్సవం



మక్తల్: మండలంలోని పస్పుల గ్రామం దగ్గర కృష్ణానది ఒడ్డున వెలసిన శ్రీవల్లభాపురం దత్తాత్రేయ స్వామి రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి స్వామిని రథోత్సవంపై కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి రథాన్ని లాగి ప్రారంభించారు. వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య రథం ముందుకు లాగారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దత్తప్ప, కార్యదర్శి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చిన తొమ్మిదో తరగతి విద్యార్థిని

మద్దూరు: మండలంలోని ఓ తండాకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. విద్యార్థిని తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లగా.. తన నాన్నమ్మ వద్ద ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేదని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ముంబై నుంచి గ్రామానికి వారం రోజుల క్రితం వచ్చారు. అయితే విద్యార్థినికి థైరాయిడ్ సమస్య ఉండటంతో వారు కూడా ఎక్కువగా పట్టించుకోలేదు. బుధవారం ఒక్కసారిగా కడుపు నొప్పి రావడంతో ద్విచక్ర వాహనంపై మద్దూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువచ్చారు. ఆస్పత్రిలోని బాత్‌రూంలోకి వెళ్లిన విద్యార్థిని.. అక్కడే మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే డాక్టర్ రహీం వైద్యసేవలు అందించారు. బాలిక శిశువుకు జన్మనిచ్చిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు శిశువుని వదిలేద్దామని నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో ఉన్న వారితో పాటు చాలా మంది అక్కడికి వచ్చి శిశువుని ఇవ్వాలని అడగడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లిబిడ్డను మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తామని డాక్టర్ తెలిపారు. కాగా, అదే తండాకు చెందిన ఓ యువకుడి కారణంగా విద్యార్థిని గర్భం దాల్చినట్లు తెలిసింది.



అయిజలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ధరూర్,పారుచర్లలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సరిత



అమరవాయిలో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



గట్టు బస్టాండ్ ఆవరణలో శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గరళకంఠుడికి ఘనంగా పూజలు

- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- ఘనంగా శివపార్వతుల కల్యాణం

సాక్షి, నెట్‌వర్క్: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల ఆలయాల్లో పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పూజల అనంతరం భక్తులు ఉపవాస దీక్ష ప్రారంభించారు.

➪ శాంతినగర్, వడ్డేపల్లి పరిధిలోని శివాలయాల్లో అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.

➪ ధరూర్, పారుచర్ల గ్రామంలో శివపార్వతుల కల్యాణంలో జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ సరిత పాల్గొని పూజలు చేశారు. ధరూరులోని శివాలయంలో సాయంత్రం ప్రత్యేక లింగ దర్శనం కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పండ్ల పంపిణీ చేశారు.



రాజోళిలో భ్రమరాంబ అడిశేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

➪ రాజోళి మండల కేంద్రంలో భ్రమరాంబ అడిశేశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మ వార్ల కల్యాణం నిర్వహించారు.

➪ మల్దకల్, అమరవాయి, బిజ్వారం, ఎల్కూరు, కుర్తిరావులచెర్వు, తాటికుంట, శేషంపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. శివమాలధారులు ఇరుముడితో శ్రీశైలంలో మొక్కులు సమర్పించి స్వగ్రామాలకు చేరారు.

➪ గట్టు బస్టాండు ఆవరణలోని శివాలయంలో ఆలయ ధర్మకర్తలు ఆరగిద్దవెంకటేష్‌శెట్టి, శ్రీనివాసులుశెట్టి, తిరుమలేష్‌శెట్టి, నరేష్‌శెట్టి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు బసవేశ్వర దేవాలయం, వీరభద్ర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

➪ కేటీదొడ్డి మండల కేంద్రంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

➪ మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివలింగానికి ప్రత్యేకంగా ఆకుపూజలు నిర్వహించారు.

➪ అయిజలోని మహా శివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని గుంతరామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు శివ లింగానికి అభిషేకాలు చేశారు. ఆలయ కమిటి సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహా శివరాత్రి సందర్భంగా 180 కేజీల పంచలోహ విగ్రహంతో చేసిన ధ్వజస్తంభం తొడుగును అమర్చారు.



ధరూరులో శివాలయం వద్ద భక్తుల భారీ క్యూలైన్



కేటీదొడ్డి శివాలయం దగ్గర శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



అయిజలో గుంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

‘అంగన్‌వాడీ’లకు సొంత భవనాలేవి?



చెన్నిపాడులో అద్దె భవనాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

- అద్దె భవనాల్లో అరకొర వసతులు
- ఏళ్లు గడుస్తున్నా పట్టింపులేదు
- ఇబ్బందుల్లో పిల్లలు, మహిళలు

మానవపాడు: అద్దె భవనాలు, అరకొర వసతులు, ఇరుకు గదులు, ఆటస్థలాల్లేక, అసౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పుతారు. ప్రభుత్వం వారికి పౌష్టికాహారంతో పాటు కోడిగుడ్లు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఐదేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. మహిళలకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఎన్నో ఏళ్లుగా అద్దె భవనాల్లో, పాఠశాలకు పక్కనే ఉన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లలు, మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో 37 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లేవు. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి.


తప్పని ఇబ్బందులు..

అద్దె భవనాల్లో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరిగా మరుగుదొడ్లు లేవు. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరి పాతగోడలున్నాయి. తలుపులు, కిటికీలు సరిగ్గా లేవు. మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు సొంతభవనాలు నిర్మించి అవసతులు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భవనాలకు మోక్షం లేదు..

మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం గతంలో ప్రతిపాదనలు చేసినా, ఇంత వరకు గ్రామాల్లో కార్యరూపం దాల్చలేదు. అనేక కారణలతో అంగన్‌వాడీ భవనాలను నిర్మించలేకపోతున్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల సొంత భవనాల నిర్మాణం ముందుకు సాగడం లేదు.

సొంత భవనాల్లేక అవస్థలు



గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాల్లేక అవస్థలు పడుతున్నారు. చిన్నారులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, మౌలిక వసతులు కరువయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి, వాటిని పూర్తిచేయాలి. ఉన్నతాధికారులు, ప్రభుత్వం చొరవ చూపి భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– ఆత్మలింగారెడ్డి, మాజీ సర్పంచ్, కలుకుంట్ల

ఉన్నతాధికారులకు నివేదించాం..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు, సొంత భవనాలు నిర్మించే విషయం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు ప్రతి నెల రెంటు చెల్లిస్తున్నాం. సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– సుజాత, ఐసీడీఎస్ సీడీపీఓ, మానవపాడు

డీసీఎం ఢీకొని నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



డీసీఎం ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్

అమరచింత: ఎండు మిర్చి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన ఘటన అమరచింత పట్టణ శివారులో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన రాజేష్ అనే రైతు తాను పండించిన మిర్చి పంటను మార్కెట్‌లో విక్రయించేందుకు డీసీఎంను కిరాయికి తీసుకొచ్చాడు. మంగళవారం రాత్రి డీసీఎంలో మిర్చిని లోడ్ చేసి మార్కెట్‌కు తరలిస్తుండగా.. పంటపొలంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని గమనించి సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ తీసుకుందామనుకున్నాడు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి సబ్‌స్టేషన్‌లో ఉన్న ఆపరేటర్ మద్దూర్ శ్రీనుకు ఫోన్‌చేసి ఎల్‌సీ ఇచ్చి కరెంట్ సరఫరా కాసేపు ఆలపాలని రైతు కోరాడు. ఎల్‌సీ ఇచ్చామని ఆపరేటర్ చెప్పడంతో డీసీఎంను పంట పొలం నుండి రోడ్డుపైకి తీసుకొచ్చే క్రమంలో క్యామ రాములు పంట పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీసీఎం బలంగా ఢీకొట్టింది. దీంతో అక్కడే ఉన్న సిమెంట్ స్తంభాలు విరిగి పడటంతో పాటు మరో మూడు ఇనుప విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని విద్యుత్ సిబ్బంది తెలిపారు. సమయానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సబ్‌స్టేషన్‌లో ఉన్న ఆపరేటర్ సంబంధిత లైన్‌మెన్ పర్మిషన్ తీసుకోకుండా అడ్డగోలుగా ఎల్‌సీలు ఇవ్వడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువకుడికి దేహశుద్ధి

నవాబుపేట: ఆలయంలో అసభ్యంగా ప్రవర్తించడంతో ఓ యువకుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. తిర్మలాపూర్‌కి చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి మండలంలోని కొల్లూర్‌లో ఉన్న భవాని మాత ఆలయంలో అమ్మవారి విగ్రహం వద్ద అనుచితంగా ప్రవర్తించాడు. గమనించిన గ్రామస్తులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

వెల్లివిరిసిన మతసామరస్యం

- ఉపవాస దీక్షాపరులకు ఫలహారం అందించిన నూరుల్ హసన్

స్టేషన్ మహబూబ్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో మతసామరస్యం వెల్లివిరిసింది. ఉపవాస దీక్షాపరులకు ఈద్గా కమిటీ ఉపాధ్యక్షుడు నూరుల్ హసన్ బాయమ్మతోటలో ఫలహారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. పండుగలతో సోదరభావం పెంపొందుతుందని అన్నారు. నూరుల్ హసన్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, మైనార్టీ నాయకులు హనీఫ్ అహ్మద్, సమద్‌ఖాన్‌తోపాటు ఎస్ఎం.ఖలీల్, నిజాముద్దీన్, ఎం.ఎ.రహీం పాల్గొన్నారు.



ఉత్సాహంగా సందెపురాళ్ల పోటీలు



బల్గెరలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న బాసు గోపాల్

గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సందెపురాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.4,016లు గీరప్పగాళ్ల హనుమంతు గెలుపొందాడు. ద్వితీయ బహుమతి రూ.3,016లు నర్సింహ, తృతీయ బహుమతి రూ.2,016లు జగదీష్, తిమ్మప్పలు, నాలుగో బహుమతి రూ.1,016లు హనుమంతు దక్కించుకున్నారు. పోటీల్లో పాల్గొన్న మరో 8 మందికి ప్రోత్సాహక బహుమతిగా ఒక్కొక్కరికి రూ.500లు అందజేశారు. విజేతలకు బీఆర్ఎస్ నాయకుడు బాసు గోపాల్‌నాయుడు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బసప్ప, బత్తలయ్య, నర్సప్ప, ముక్కెరయ్య, బాసు నర్సింహ, గుడిసె వీరేష్, పోతులరాజు, హనుమంతు, రామకృష్ణ పాల్గొన్నారు.

కనుల పండువగా ప్రభోత్సవం

- ఘనంగా అరణ్జేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ధరూరు: మండలంలోని కోతులగిద్ద అరణ్జేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి అలంకరణ, పంచామృతాభిషేకం, కుంకుమార్చణ, ఉదయం 8 గంటలకు రుద్రహోమం నిర్వహించారు. శివరాత్రి, బ్రహ్మోత్సవాలు కలిసి రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు స్వామి వారి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. గతేడాది తయారు చేయించిన ప్రభను సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య లాగారు. ఆలయం వద్ద నుంచి ప్రధాన రోడ్డు వరకు ప్రభను తీసుకెళ్లారు. ప్రభకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాలకు జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ సరిత హాజరయ్యారు. క్యాక్రమంలో మాజీ సర్పంచులు రంగన్న, రంగప్పలు, జంగిలప్ప, కపట్రాల వెంకట్‌రెడ్డి, కురువ శ్రీను, కేబీ గోవిందు పాల్గొన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పవన్‌కుమార్

వనపర్తి: జిల్లాలోని బీసీ డీఓ (జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి) బీరం సుబ్బారెడ్డి చేసిన నిధుల దుర్వినియోగంపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా.. విచారణ చేసి చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు కాలయాపన చేస్తున్నారని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోతే త్వరలో కలెక్టరేట్ ముట్టడి చేస్తామన్నారు. వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ బ్యాంకు ఖాతాలో ఉండాల్సిన నిధులను ఉపయోగించుకోవడం, కార్పొరేషన్ నుంచి జిల్లాకు కేటాయించిన నిధులకు బ్యాంకు నుంచి అదనంగా వచ్చిన వడ్డీ డబ్బులను సైతం విత్ డ్రా చేసుకున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు స్పందించి వెంటనే విచారణ పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సాయికృష్ణ, రాకేష్, బీచుపల్లి, రవీందర్, వేణు గోపాల్, రాజారెడ్డి, చరణ్, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పాన్‌గల్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్ఐ శ్రీనివాసులు, వ్యాపారవేత్త పీట్ల కతాల్ అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దులలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోటీల నిర్వహణతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పోటీలను నిర్వహిస్తున్న యూత్ సభ్యులను వారు అభినందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 32 టీంలు పాల్గొనగా.. మ్యాచ్‌లు మ్యాట్‌పై నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. విజేత జట్టుకు పీట్ల కతాల్ రూ.50 వేలు నగదు, ద్వితీయ బహుమతి రెడ్డి సేవాసమితి వారు రూ.30 వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, మధుసూదన్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, తిరుపతయ్య, ప్రసాద్‌రావు, బక్కిరెడ్డి, వివేకానందయూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.